# దూరపుకొండలు

"డాడీ నేనుండేది ఢిల్లీకదా! అక్కడి వాతావరణం మీకు సూట్‌కాదు. అందులో కొత్తగా పెళ్లి చేసుకుని కాపురం పెట్టబోతున్నాను. చిన్న పోర్షన్ మాకిచ్చింది. మా ఇద్దరికే ఇబ్బంది. ఇంత విశాలమైన ఇంట్లో వుండి అంత ఇరుకు గదుల్లో బ్రతకాలంటే మీకు పిచ్చెక్కుతుంది" కంప్యూటర్ ఇంజనీర్ శ్రీధర్ చెబుతున్నాడు.

సుబ్బరాయశర్మకు నిజంగా పిచ్చెక్కుతున్నది. మూడవ సంతానం ఉద్ధరిస్తాడని అల్లారుముద్దుగా పెంచాడు. చిన్నప్పటినుండే రెసిడెన్షియల్ స్కూల్‌కి పంపాడు. ఎంతో ఖర్చుపెట్టి రెసిడెన్షియల్ కాలేజీకి పంపాడు. అతని అభిరుచి మేరకు ఢిల్లీలో గ్రాడ్యుయేషన్ చేయించాడు.

చదువు పూర్తి చేసుకుని ఓ ప్రైవేట్ కంపెనీలో మంచి ఉద్యోగం సంపాదించాడు. పెళ్లి కూడా ఖాయం చేసాడు. వచ్చేనెల ముహూర్తం.

మొదటివాడు డాక్టర్. గవర్నమెంట్ ఉద్యోగం కావడంతో ఒక ఊరనకుండా తిరుక్కుంటూ పోతుంటాడు. కోడలు ఆధునిక భావాలు కలది కావడంతో సుబ్బరాయశర్మ వాళ్లకు దూరంగానే మసలుతూ వుంటాడు.

రెండవవాడు డాక్టరేట్ చేసి తిరుపతిలో లెక్చరర్‌గా వెలగబెడుతున్నాడు. అంతకుముందు తల్లిదండ్రులంటే ప్రాణం పెట్టేవాడు. కాని పెళ్లికాగానే కోడలు పిల్ల కొంగున కట్టేసుకుంది. మనసు మారిపోయింది. ఎవడో పరాయివాళ్లను చూసినట్లు చూస్తారు తల్లిదండ్రుల్ని!

మూడవవాడన్నా ఆదుకుంటాడని ఎదురుచూస్తున్న శర్మకు శ్రీధర్ మాటలు కొరడాతో కొట్టినట్లున్నాయి.

"డాడీ అప్పటికీ కాదు కూడదు అంటే రండి, వచ్చి నాతో వుండండి. ఆ చలికి మీకు జబ్బు చేస్తే చూసేవాళ్లు కూడా వుండరు. అమ్మని గుళ్లకి తీసుకుపోవాలంటే మా వల్ల కాదు. అసలు నన్నడిగితే చంద్రం అన్నయ్య డాక్టర్ కదా. వాడితో ఉంటే మీ సమస్యలన్నీ పోతాయి. ఈ వయసులో వచ్చే జబ్బులకు వాడు బాగా మందులిస్తాడు." శ్రీధర్ అన్నాడు తనేదో గొప్ప సలహా పారేసినట్లు ఫీలయిపోతూ.

"చాల్లేరా నీ బోడి సలహా. ఆమెతో పడకనే కదా వాళ్ల దగ్గరికి పోంది". కసురుకుంది తల్లి పార్వతమ్మ.

"పోనీ శరత్ చిన్నన్నయ్య ఉన్నాడుకదా తిరుపతిలో, వాడికయితో ట్రాన్‌ఫర్లు కూడా వుండవు. ఎప్పుడుపడితే అప్పుడు కొండకు కూడా పోయి రావచ్చు". చెప్పాడు శ్రీధర్.

"శ్రీధర్ అడుక్కు తిన్నా తింటాం కానీ వాడి దగ్గరుండం". కటువుగా చెప్పాడు సుబ్బరాయశర్మ.

"నాకు పనుంది." అని శ్రీధర్ బయటకు వెళ్లాడు.

"చూసావుటే పార్వతీ! పిల్లలమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాం. ఆ నేల తల్లిని నమ్ముకుంటే చల్లని ఒడిలో చోటు ఇచ్చేది. మనకేమండి ముగ్గురు రత్నాల్లాంటి పిల్లలున్నారు. వాళ్ల చదువుకు పొలం అమ్మేయండి. ఇల్లు అమ్మేయండి అని సలహాలు ఇచ్చావుగా. ఇప్పుడు చూడు. నిలువ నీడ కూడా లేకుండా పోయింది". బాధగా డగ్గుత్తికతో అన్నాడు శర్మ"

"దూరపుకొండలు ఈ చదువులు".

"ఛీ! వేలకు వేలుపోసి రెసిడెన్షియల్ చదువులు చెప్పించకుండా ఉన్నా బాగుండేది"పార్వతమ్మ బాధపడింది.

శ్రీధర్ తనకోసం వెయిట్ చేస్తున్న ఉడ్‌బీ శ్వేతను కలిసాడు సినిమా హాలు దగ్గర. ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నది.

అలా నడుచుకుంటూ పార్కుకు బయలుదేరాడు.

"హాయ్ శ్రీధర్ ఏంటి ఆలస్యం?"

"ఏముంది ఇంటి సమస్యలు, వెధవ సమస్యలు"

"ఓ గాడ్ వాటే హెల్!"

"ఏముంది! ముసలాళ్లు ఎక్కడుండాలని సమస్య"

"ఛీ ఏం ముసలాళ్లండి. వీళ్లకి ఆయుస్సు దేవుడు నిండుగా పోస్తాడు. డార్లింగ్ మీ వాళ్ల గురించి కాదు మా వాళ్ల గురించి కాదు ఇప్పటికే మా ముసలాళ్లతో నా మూడంతా పాడైపోతున్నది" విసుక్కుంది శ్వేత.

"బాధపడకు శ్వేతా! ఏదో మార్గం చూస్తాలే..." హామీ ఇచ్చాడు శ్రీధర్ శ్వేతతో.

వైభవంగా వివాహం జరిగింది.

అట్టహాసంగా శ్వేత కాపురానికి వచ్చింది. శ్రీధర్ ఆమెను వెంటబెట్టుకుని ఢిల్లీ బయలుదేరాడు.

"బాబూ! శ్రీధర్ మరి మమ్మల్ని ఎప్పుడు రమ్మంటావు? ఇక్కడ ఇల్లు బాడుగ ఇచ్చి అక్కడ నువ్వు బాడుగ ఇచ్చి రెండు కాపురాలకు డబ్బులు దండుగ". శ్రీధర్ వెళ్లేరోజే అడిగాడు తండ్రి.

పార్వతమ్మ శ్వేత కళ్ళల్లోకి చూసింది. ఆమె కళ్లు దించుకుంది.

"నాన్నా ! ఇప్పుడేగదా పెళ్లయింది. మమ్మల్ని సెటిల్ కానీ ఇంకొంచెం పెద్ద ఇల్లు తీసుకుని మిమ్మల్ని పిలుస్తాం! ప్రస్తుతానికి ఇక్కడే వుండండి. కాస్తో కూస్తో పంపిస్తూ వుంటాను అందుకు". శ్రీధర్ మెల్లగా చెప్పాడు.

శ్వేతకు చాలా సంతోషం కలిగింది.శ్రీధర్ ఆమాత్రం చెప్పగలిగినందుకు. అఫ్‌కోర్స్ దానికోసం తానెంతో ట్రైనింగ్ కూడా ఇచ్చింది మరి.

ఆ కాస్త పిలుపుకే శర్మ సంబరపడిపోయాడు. పార్వతమ్మకు సంతోషం కలిగింది.

శ్రీధర్ శ్వేతతో ఢిల్లీ వెళ్ళి మూడునెలలయింది. నాలుగు నెలలు గడిచాయి.

"ఎప్పుడు రమ్మంటావు"? అని రాసిన శర్మ ఉత్తరానికి ఇంకా ఇల్లు దొరకలేదు అని సమాధానం వచ్చింది.

ఇంకా కొన్నాళ్లు చూసి 'పోనీ నేనూ, మీ అమ్మ వచ్చి మీతోపాటే ఇల్లు వెతుకుతాం, రమ్మంటావా'? అని రాసాడు శర్మ.

కానీ...

"మీకా శ్రమెందుకు. మీ కోడలు కూడా ఇళ్ల కోసం వెతుకుతున్నది. ఇదేం పల్లెటూరు కాదు- ఇల్లు దొరకడానికి. కాస్మోపాలిటన్ సిటీ. ఓపికపట్టండి." అని సమాధానం తిరుగుటపాలో వచ్చింది.

కాలచక్రం గిర్రున తిరుగుతూనే వుంది.

క్రమంగా ఉత్తరాలు సన్నగిల్లాయి. పంపిస్తానని చెప్పిన డబ్బులు కూడా రాలేదు కొడుకునుండి.

ఎప్పుడో రిటైరైన బడిపంతులు వృత్తిని తిరిగి స్వీకరించాల్సి వచ్చింది శర్మకు. వాళ్ళకి

వీళ్లకీ ట్యూషన్లు చెబుతూ బ్రతుకు భారంగా ఈడుస్తున్నాడు. ఎప్పటికైనా కొడుకునుండి రమ్మనమని పిలుపు వస్తుందని ఎదురు చూస్తూ.

ఓ రోజు ఆదిరాజు సలహా కోసం వచ్చాడు.

"శర్మగారూ! మీ అబ్బాయిలంతా చాలా గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారుకదా. దానికంతా మీరేసిన పునాదేగదా కారణం. మా అబ్బాయిలని ఏం చదివించాలని తెగ ఆలోచిస్తున్నాను. ఏ ఊరుకు పంపించమంటారు?"

"ఎంత వయస్సు"?

"ఐదేళ్లు వకడికి. పదేళ్లు ఇంకోడికి. గొప్ప కాన్వెంట్ చదువులు చదివిద్దామని ఉంది. ఈ ఊళ్లో అయితే చదువు సందెలు లేకుండా చెడిపోతారు అని మా ఆడాళ్లు అంటున్నారు. ఏ ఊరికైనా పంపి రెసిడెన్షియల్ చదువు చదివించమంటున్నది. మీకైతే బాగా తెలుసుకదాని మీ దగ్గరికి వచ్చాను". వినయంగాఅన్నాడు ఆదిరాజు.

"ముందు ఇది చెప్పు మీ కొడుకులు నీకు ఉపయోగపడాలా, దేశానికి ఉపయోగపడాలా"? సూటిగా అడిగాడు.

"చిత్రంగా మాట్లాడుతున్నారే. దేశంకు ఉపయోగపడాలి, నాకూ ఉపయోగపడాలి." నవ్వాడు ఆదిరాజు.

"అయితే మనూళ్లోనే చేర్పించు. నీ దగ్గరే వుండి చదివించు. దూరపు కొండల చదువుల కోసం పిల్లలు దూరం అయ్యేకొద్దీ అనురాగాలు, ఆప్యాయతలు మాసిపోతాయి. దూరమైతాయి. మన భారతీయ సాంప్రదాయాలు మంటకలిసే చదువులు మనకెందుకయ్యా! శుభ్రంగా నీ కళ్లెదుటే ఉంచుకుని వచ్చినకాడికి చదివించు. వృద్ధాప్యంలో నీకు ఆసరాగా వుంటారు" శూన్యంలోకి చూస్తూ అన్నారు శర్మ.

ఆదిరాజు బిత్తరపోయాడు.

తలుపు చాటునుండి వింటూన్న పార్వతమ్మ కళ్లు తుడుచుకుంది.

(ఆదివారం ఆంధ్రభూమి)

